## క్లుప్తంగా

### ఆలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

వేంసూరు: మండలంలోని కల్లురుగూడెం కొదండ రామాలయం పునఃనిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ.50 లక్షలు మంజూరు కాగా.. సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, రమేష్, దామోదర్‌రెడ్డి, రామిరెడ్డి, శ్రీహరి రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు కృష్ణయ్య

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి సొసైటీ పరిధిలోని అయ్యగారిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అధ్యక్షుడు చల్లగుండ్ల కృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధరకు విక్రయించాలన్నారు. క్వింటా ధాన్యం గ్రేడ్–1కు రూ.2,320, కామన్ గ్రేడ్ రూ.2,300ల మద్దతు ధర పొందాలని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సతీష్‌కుమార్, రైతులు, క్లార్కులు విజయ్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

### సాంస్కృతిక కళాప్రదర్శనలు ప్రారంభం



కళాప్రదర్శనలను ప్రారంభిస్తున్న దృశ్యం

మధిర: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సుమిత్రయూత్ అసోసియేషన్ మధిర వారు ఉగాది సందర్భంగా మధిర రైల్వే కాలనీ శ్రీకోదండరామ స్వామి ఆలయంలో.. నిర్వహించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గత రాత్రి ప్రదర్శించిన భక్తి సంప్రదాయ నృత్యాలు, కోలాటాలు, అలరించాయి. కార్యక్రమంలో కంచి దయానంద భూషణ్, కిషోర్ రెడ్డి, రైల్వే అధికారులు శ్రీనివాసరావు, మల్లేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

### ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా గుడ్ సాహేబ్



వల్లబిలో ఆత్మకమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన గుడ్ సాహేబ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ముదిగొండ: మండలంలోని వల్లబికి చెందిన షేక్ గుడ్ సాహేబ్ మధిర నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వల్లబిలో సోమవారం ఆయనను యువజన కాంగ్రెస్ నాయకుడు బిచ్చాల అన్వేష్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మైనారిటీ మండల అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సంగీతరావు, రమేష్, చందు, వంశీ, వెంకటేష్, వినోద్, ముత్యాలరావు, ఉస్మాన్, రసూల్, అల్లావుద్దీన్, ఫుల్‌సాహేబ్ పాల్గొన్నారు.

### సన్మానం..



సుస్మితను సన్మానిస్తున్న నీలాద్రి ఆలయ డైరెక్టర్ నాగిరెడ్డి

తల్లాడ: తల్లాడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, విజయమ్మ దంపతుల కుమార్తె సుస్మిత ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా సుస్మితను నీలాద్రి ఆలయ డైరెక్టర్ దుగ్గుల నాగిరెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కస్తూరిరాజ్ ఉన్నారు.



ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ముస్లిం మత పెద్దలు మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ మాస పవిత్రతను వివరించారు. బంధువులు, స్నేహితులకు సేమియా పాయసం అందజేసి.. ఈద్ ముబారక్ అంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలను తెలుపుకున్నారు. అనంతరం పేదలకు దాన ధర్మాలు చేశారు. ఈ ప్రార్థనల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



# భక్తి శ్రద్ధలతో రంజాన్



సత్తుపల్లిటౌన్: ఈద్గాలో ఎమ్మెల్యే రాగమయి, తుమ్మల యుగంధర్



కొణిజర్ల: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కల్లూరులో..



ఎర్రుపాలెం: మీనవోలులో..



వైరా: బోధిస్తున్న ముస్లిం మత పెద్ద



ముదిగొండ: అయ్యగారిపల్లి ఈద్గాలో..



సత్తుపల్లి: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



తల్లాడ: నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు



వేంసూరులో..



వైరారూరల్: ఖానాపురం ఈద్గాలో..



ఏన్కూరు: తిమ్మారావుపేట మసీదులో..



కారేపల్లి: ఈద్గా వద్ద ముస్లిం సోదరులు



బోనకల్: ముష్టికుంట్లలో..



పెనుబల్లిలో..



చింతకాని: లచ్చగూడెం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

### రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న పూర్ణచంద్రారెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని బీమవరంలో ఉంటున్న కాంగ్రెస్ నాయకుడు ఎరమల పూర్ణచంద్రారెడ్డి ఎర్రుపాలెంటౌన్‌లో ఉన్న 12మసీద్‌లకు తన సొంత ఖర్చులతో రంజాన్ తోఫాను సోమవారం అందించారు. ఈ సరుకులను కాంగ్రెస్ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు షేక్.జానీపాషా ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. 12మంది ఇమామ్‌లతో పూర్ణచంద్రారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కుటుంబ సభ్యులకు దువా చేయించారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యసంఘం సభ్యులు షేక్ బాషిత్‌అలీ, మహ్మద్ రఫీ, నాగుల్‌మీరా, జిలానీ, సలాం, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

### ఈద్గా కోసం స్థలం వితరణ



ఈద్గాను ప్రారంభిస్తున్న మువ్వా జగన్నాథరావు

మధిర: మండలంలోని ఖమ్మంపాడులో ఈద్గా కోసం మువ్వా పున్నయ్య కుమారులు మువ్వా జానకిరామయ్య, మువ్వా రమణయ్య, మువ్వా శేషగిరి రావుల వారసులు 10సెంట్ల స్థలాన్ని ముస్లింలకు వితరణగా అందించారు. సోమవారం ఆ స్థలాన్ని మువ్వా జగన్నాథ రావు(జగ్గయ్య) రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే ముస్లింల శ్మశాన వాటిక ఖబరస్థాన్‌కు దారి ఇబ్బందిగా ఉన్న పరిస్థితుల్లో ఖమ్మంపాడు ముస్లింలు అభ్యర్థించగా.. ఆ వారసులు దారి కోసం పది అడుగుల స్థలాన్ని కేటాయించారు. దీంతో దాతల కుటుంబాలకు ఖమ్మంపాడు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంపాడు చెందిన పలు ముస్లిం కుటుంబాలు పాల్గొన్నారు.

## ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



టేకులగూడెంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: మండలంలోని టేకులగూడెంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. వేదపండితుల నడుమ గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో శిఖర, కలశ, ధ్వజ, శివలింగ, నంది, గణపతి ప్రతిష్ఠమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఆయన కుమార్తె ఉస్మానియా లా కళాశాల ప్రిన్సిపాల్ గుమ్మడి అనురాధతో పాటు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఇంటికి వెళ్లి కాసేపు ముచ్చటించి తేనేటి విందు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను ఎమ్మెల్యేకి వివరించగా.. ఆయన గ్రామాభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తా నర్సన్నా..! అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల, మండల అధ్యక్షులు చంద్రప్రకాశ్, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఏన్కూరు, గార్లఒడ్డులో పర్యటన..**

ఏన్కూరు: మండల కేంద్రంలోని సాగర్‌కాలువను, గార్లఒడ్డులోని చెరువును సోమవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పరిశీలించారు. సాగర్ కాల్వ నుంచి లిఫ్ట్ ద్వారా గార్లఒడ్డు చెరువుకు నీటిని విడుదల చేస్తే 200 ఎకరాలు ఆయకట్టు సాగులోకి వస్తుందని రైతులు తెలుపగా.. ఆయన ఇరిగేషన్ ఈఈకి ఫోన్ చేసి మాట్లాడి, ప్రతిపాదనలు పంపి లిఫ్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుంటానన్నారు. కార్యక్రమంలో సొసైటి చైర్మన్ వెంకటేశ్వరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్, లాలునాయక్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

### బాధితుడికి రూ.10వేలు ఆర్థిక సాయం



రూ.10వేలు అందిస్తున్న రామకృష్ణ

కల్లూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కల్లూరు పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన కొత్తపల్లి కోడేశ్రాచుకు బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు పెదకంటి రామకృష్ణ సోమవారం బాధితుడికి రూ.10 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో కల్లూరు సొసైటీ చైర్మన్ బోబోలు లక్ష్మణ్‌రావు, నాయకులు కృష్ణ, వెంకటేశ్వరరావు, ప్రసాద్, వెంకటరత్నం, కిరణ్, జమలయ్య, పిచ్చిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శిలువ యాత్ర



ప్రార్థన చేస్తున్న ఫాదర్ రవి

వైరా: వైరాలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ మాదాసు రాజు ఆధ్వర్యంలో సోమవారం ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాన్‌బాస్కో ఫాదర్ రవి సువార్త బోధించారు. 40 రోజుల పాటు ఉపవాసాలు ఉండి క్రీస్తు నందు భక్తిశ్రద్ధలు చూపితే సైతాన్‌ను జయించినట్లే అన్నారు. కార్యక్రమంలో దీక్షా పరులు, సంఘస్తులు పాల్గొన్నారు.

**హోలీ ట్రినిటీ చర్చి ఆధ్వర్యంలో.. అల్లిపల్లి యాత్ర**

వైరా శాంతినగర్‌లోని హోలీ ట్రినిటీ చర్చి ఆధ్వర్యంలో ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా అల్లిపల్లి మేరీ మాత చర్చి యాత్ర కార్యక్రమాన్ని ఆది, సోమవారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ జ్వాన్నేసు ఆధ్వర్యంలో సుమారు 60 మంది దీక్షాపరులు అల్లిపల్లి మాత దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి శిలువమార్గ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సిస్టర్ యమున, సుమ, సంఘస్తులు పాల్గొన్నారు

### తొట్టి నిండా నీరు

ముదిగొండ: భానుడి భగభగలకు మూగజీవాలకు దాహం తీరడం లేదు. పెద్దమండవలో ఊరి చివరణ ఉన్న నీటితొట్టి నిండా నీరు కనిపించే సరికి మూగజీవాలు సంభరమాశ్చర్యంలో మునిగాయి. రహదారి పక్కనే ఉన్న నీటితొట్టి నిండా పంపు కనెక్షన్ ద్వారా ఫుల్‌గా నీరు నిండి ఉండడంతో పొలాలకు మేతకు అటుగా వెళ్తున్న మేకలు తమ దాహం తీర్చుకున్నాయి.



పెద్దమండవలో ఊరి చివరిన తొట్టిలోని నీటితో దాహం తీర్చుకుంటున్న మూగ జీవాలు

## కౌలు రైతులకు భరోసా కల్పించాలి

వైరారూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులకు భరోసా కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని విప్పలమడక గ్రామంలో సోమవారం సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టడీ సర్కిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర చేస్తుందని విమర్శించారు. ఆ తర్వాత వ్యవసాయ సంక్షోభంకు నెలకొన్న కారణాలను వివరించారు. బాణాల శ్రీనివాసరావు, పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, కొలికొండ వీరభద్రం, మేడా శరబంధి, దేవభక్తిని అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### చల్లని నీడలో..!



చెట్టు కింద సోడా విక్రయిస్తున్న వ్యాపారి

ఎండలు దంచికొడుతున్నాయి. మార్చి నెలాఖరులోనే ఉష్ణోగ్రతలు ఈ స్థాయిలో ఉంటే రానున్న కాలంలో ఏ విధంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యాన ఎండ తీవ్రతను నుంచి కొంత ఉపశమనం కలిగించేందుకు కొందరు చిరువ్యాపారులు ప్రధాన రహదారుల వెంట ఉన్న చెట్ల నీడ కింద చల్లని పానియాలను విక్రయిస్తున్నారు. ఇందులో సోడా, లస్సీ, కొబ్బరి బోండాలు, చెరుకు రసం వంటి పానియాలు ఉండగా.. రాకపోకలు సాగించే ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు వీటిని తాగి సేదదీరుతున్నారు. కొందరు కూర్చునేందుకు వీలుగా కర్రలతో బెంచీలు సైతం ఏర్పాటు చేశారు.

– మధిర

## కూపన్ల పేరుతో దందా..

- ఆగని ఇసుక అక్రమ రవాణా
- రాత్రి, తెల్లవారు జామునే అధిక తోలకాలు
- పట్టించుకోని అధికారులు



అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన దృశ్యం (ఫైల్)



తెల్లవారు జామున ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం

**మండలంలో పెద్దమండవ, గంధసిరి మున్నేరుల నుంచి ఇసుకను తోడేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్న దారులు ఎంచుకుని యథేచ్ఛగా తరలిస్తున్నారు. పట్టుపడినవారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.**

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ మున్నేరు నుంచి గతంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. గంధసిరి నుంచి అదే తంతు జరుగుతోంది. ముదిగొండ పోలీస్ స్టేషన్ నుంచి పోలీస్‌లు బయలుదేరే.. పక్కా సమాచారంతో కొంత మంది ఎస్కార్టులు ముందస్తుగా అక్రమార్కులకు సమాచారం అందిస్తారు. ఇక అంతే ఎక్కడ రవాణా అక్కడే ఆగుతుంది. పగలు ఇసుక లోడింగులు, రాత్రిళ్లు, తెల్లవారుజామున రవాణాలు జరుపుతుంటారు. రెవెన్యూ అధికారులు ఎలాంటి అనుమతులు లేని ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేస్తుండగా.. మైనింగ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

**భయాందోళనలో గ్రామస్తులు..**

ఇసుక ట్రాక్టర్లు పలు గ్రామాల గుండా పగలూ, రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో అతివేగంగా వెళ్తుండడం వలన కంటి మీద కునుకు ఉండడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక చేతితో ఫోన్ మాట్లాడుతూ.. ట్రాక్టర్లు నడుపుతుండడంతో పాటు లౌడ్ స్పీకర్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటితో ఎప్పుడు, ఎక్కడ ఏం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురౌతున్నారు.

**కూపన్లు తక్కువ.. రవాణా ఎక్కువ..**

రోజుకు 50 నుంచి 60 కూపన్లు ఇస్తే, 100నుంచి 150 ట్రాక్టర్లు అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం. ట్రాక్టర్లకు నంబర్లు, లైసెన్స్‌లు లేకుండా రోడ్లపై యథేచ్ఛగా ఇసుక దందా సాగిస్తున్నారు.

**తనిఖీ చేస్తున్నాం..**



రెవెన్యూ సిబ్బంది గతంలో లాగా లేకపోవడంతో ఆఫీసులోనే సరిపోతుంది. రెవెన్యూ పోలీసులు సంయుక్తంగా దాడులు చేపట్టి.. కేసులు నమోదు చేస్తున్నాం, ఇప్పటికే కూపన్‌లు లేని చాలా ఇసుక ట్రాక్టర్‌లు పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఉంచడం జరిగింది. ఎవరిని వదిలమని.. కూపన్లు ఉంటేనే ఇసుకను తీసుకెళ్లాలని, లేకపోతే చర్యలు తప్పవన్నారు.

– సునీత ఎల్జిబెత్, తహసీల్దార్, ముదిగొండ

**నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..**



రాత్రి పెట్రోలింగ్ నిర్వహించే టప్పుడు, కూపన్లు లేకుండా పట్టుబడ్డ ట్రాక్టర్లను సీజ్ చేసి కోర్టుకు పంపిస్తున్నాం. ఇసుక అక్రమ రవాణాదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. అన్ని అనుమతి పత్రాలు ఉంటేనే ఇసుకను తరలించాలని చెప్పాం. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– మురళి, సీఐ, ముదిగొండ

గంధసిరి, పెద్దమండవ మున్నేరుల్లో ఇసుక కోసం లోతుగా తవ్వకాలు జరుపుతున్నారు. సమీప ప్రాంతాల గ్రామాలైన పండ్రేగుపల్లి, ముత్తారం, కోదండ రామాపురం, వల్లాపురం, గంధసిరి, పెద్దమండవ, మల్లారం గ్రామాల ప్రజలకు సాగు, తాగు నీటికి ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని, అధికారుల పర్యవేక్షణ కరువైందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పోలీస్ శాఖ పట్టించుకోకపోవడంతో రెవెన్యూ, మైనింగ్‌శాఖల అధికారులు నామమాత్రపు దాడులు నిర్వహించి వదిలేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.